సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 3 । జనవరి । 2023



ఆదాయంపై ఆర్టీసీ నజర్

సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 236 స్పెషల్ బస్సులు నడనుంది. ఈ మేరకు ఏర్పాట్లు చేసింది. 8లో▸



దేవతామూర్తులకు పూలతో అలంకరణ

దేవుడిని దర్శించుకుంటున్న చిన్నారి

‘ముక్కోటి’ దర్శనం



మంచిర్యాల విశ్వనాథ ఆలయంలో హారతి ఇస్తున్న పూజారి

- ఉత్తర ద్వారం ద్వారా భక్తుల దర్శనం
- ఆలయాల్లో సందడి

మంచిర్యాలఅర్బన్/దండేపల్లి: ముక్కోటి ఏకా దశి సందర్భంగా సోమవారం జిల్లాలోని ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు బారులు తీరారు. వేకువజాము నుంచే వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మంచిర్యాలలోని విశ్వనాథ ఆలయంలో ఉదయం 5.30గంటల నుంచే భక్తులు దర్శనానికి తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. రద్దీ దృష్ట్యా వేంకటేశ్వరస్వామి ఆలయం మీదుగా శివాలయం, వాసవి కన్యకాపరమేశ్వరి దర్శనం చేసుకునేలా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అష్టోత్తర నామ స్మరణతో శివునికి అర్చ న చేశారు. ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు ఉత్తర ద్వార దర్శనంతో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో ముక్తారవి, రేనోవేషన్ కమిటీ చైర్మన్ సిరిపురం శ్రీనివాస్, ఆలయ అర్చకులు నరహరిశర్మ, భట్టాచార్య, బాలకృష్ణ పాల్గొన్నారు. తిరుమలగిరి కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌన్సిలర్ హరికృష్ణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్, వైస్ ప్రెసిడెంట్ విజయబాబు రావు, కోశాధికారి శ్రీనివాస్, కరుణాకర్, బోరిగం వెంకటేశ్, చిరంజీవి పాల్గొన్నారు. గౌతమినగర్ కోదండ రామాలయం–శ్రీరామ లింగేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్ పాల్గొన్నారు. గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో ఏకాదశి వేడుకలు నిర్వహించారు. భక్తులు సత్యదేవుణ్ని ఉత్తర ద్వారం గుండా దర్శించుకున్నారు.



విశ్వనాథుని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు



మంచిర్యాల విశ్వనాథ ఆలయంలో బారులు తీరిన భక్తులు



ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



దండేపల్లి: సత్యదేవుణ్ని దర్శించుకుంటున్న భక్తులు

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు



పూలమొక్క అందిస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తెలంగాణ నాన్ గజిటెడ్ ఎంప్లాయిస్ యూనియన్(టీఎన్జీవోస్) సభ్యులు సోమవారం కలెక్టర్, అధికారులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ భారతిహోళ్లికేరి, జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, కలెక్టరేట్ ఏవో సురేశ్‌లకు శుభాకాంక్షలు తెలిపి పూలమొక్క అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, టీఎన్జీవోస్ ఫారెస్ట్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు పొన్న మల్లయ్య, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కెజియా రాణి, సంయుక్త కార్యదర్శి సునీత, వెంకటకృష్ణ, ప్రచార కార్యదర్శి సతీశ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రావణ్, నాగుల గోపాల్, ప్రభులింగం, అంజయ్య, వెంకటేశ్, లక్ష్మణ్, గణపతి పాల్గొన్నారు.

డీపీఆర్‌వో శుభాకాంక్షలు

మంచిర్యాలఅగ్రికల్చర్: కలెక్టర్ భారతీ హోళ్లికేరిని సోమవారం జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి వై.సంపత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేశారు.

భద్రాచలంకు సూపర్‌లగ్జరీ బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల నుంచి భద్రాచలంకు వెళ్లే కొత్త సూపర్‌లగ్జరీ బస్సును సోమవారం రాత్రి ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రారంభించారు. పాత బస్సు స్థానంలో మంచిర్యాల డిపోకు కొత్తగా సూపర్‌లగ్జరీ బస్సును యాజమాన్యం కేటాయించింది. ఈ కార్యక్రమంలో డీఎం రవీంద్రనాథ్, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ సురేందర్‌రావు, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 11వ వేజ్‌బోర్డు సమావేశం

శ్రీరాంపూర్: బొగ్గు గని కార్మికులకు సంబంధించిన 11వ వేజ్‌బోర్డు(జేబీసీసీఐ) సమావేశం మంగళవారం కోల్‌కత్తాలో జరుగనుంది. ఇప్పటికి ఏడు సార్లు వేజ్‌బోర్డు సమావేశం జరిగిన కూడా ప్రతీసారి యాజమాన్యం జాతీయ సంఘాలు పేర్కొన్న కనీస వేతనాల (ఎంజీబీ) పెరుగుదలపై ఏమాత్రం ముందడుగు వేయడం లేదు. నేడు 8 దఫా జరిగే చర్చల్లోనైనా స్పష్టత వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. క్రితంసారి చర్చల్లో కోలిండియా యాజమాన్యం 10 శాతం పెంపునకు ముందుకు రాగా జాతీయ సంఘాల నేతలు ససేమిరా అన్నారు. కనీసం 20 శాతానికి తగ్గకుండా ఇస్తేనే ఒప్పుకుంటామని తెలుపగా డీపీఈ గైడ్‌లైన్స్ ప్రకారం అంత వేతనం పెంచితే అధికారుల వేతనాలకు మించిపోతాయి కావున కుదరని చెప్పారు. దీనిపై జాతీయ సంఘాలు అయితే డీపీఈ గైడ్‌లైన్స్‌ను మార్చడం లేదా, దాని నుంచి బొగ్గు గని కార్మికులను మినహాయింపు చేయడం చేసిన తరువాతే మళ్లీ చర్చలకు వస్తామని తేల్చి చెప్పి నాటి చర్చల నుంచి నిష్క్రమించారు. ఇప్పుడు యాజమాన్యమే చర్చలకు పిలువడంతో ఈ చర్చల్లో పురోగతి ఉండే అవకాశం ఉందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ.సీతారామయ్య ఆశాభావం వ్యక్తం చేశారు.

పశుమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న పశుమిత్రలు

పాతమంచిర్యాల: పశుసంవర్ధక శాఖలో పని చేస్తున్న పశుమిత్రలకు కనీస వేతనం నిర్ణయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎలాంటి జీతభత్యాలు లేవని, స్వచ్ఛందంగా పశువులకు వైద్యం చేస్తున్నామని తెలిపారు. ఎనిమిదేళ్లుగా గ్రామాల్లోని రైతుల పశువులకు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. పశుమిత్రల సంఘం జిల్లా అధ్యక్షురాలు అక్కల సునీత, కార్యదర్శి ఇరుసుల్ల శ్రీలత, కోశాధికారి లావణ్య పాల్గొన్నారు.

అంటుకుంటే బూడిదే..!



సోమవారం తెల్లవారు జామున జిల్లా కేంద్రం మంచిర్యాలలో ఓ పూజా సామగ్రి దుకాణంలో మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక, పోలీసు అధికారులు శ్రమిస్తున్న దృశ్యమిది. ఈ భవనానికి సరిగా గాలి కూడా వెళ్లలేనంతా ఇరుకుగా ఉంది. దట్టమైన పొగ పై అంతస్తులో చుట్టుముట్టింది. అదుపులోకి తెచ్చేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. చివరకు భవనం వెనుకవైపు గోడకు రంధ్రం చేసి అందులో నుంచి నీటిని పంపితే మంటలు చల్లారాయి. ప్రమాదాలు జరిగితే ఇలాంటి భవనాలతో ఆస్తి నష్టం అధికంగా జరుగుతోంది.

- అగ్నిప్రమాదం కొంత.. నిర్లక్ష్యమెంత ?
- చాలా భవనాలకు రక్షణ జాగ్రత్తలపై అశ్రద్ధ
- రూ.కోట్ల వ్యాపారం చేస్తున్నా ఫైర్ సేఫ్టీ కరువు
- చలికాలంలోనూ పెరిగిన ప్రమాదాలు
- నోటీసులతో చేతులు దులిపేసుకుంటున్న అధికారులు

ప్రమాదంపై ఫోన్ చేయాల్సిన నంబర్లు

మంచిర్యాల	87126 99194
జన్నారం	87126 99196
బెల్లంపల్లి	87126 99198
చెన్నూరు	87126 99200

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అనుకోని ప్రమాదం సంభవిస్తే మంటలను అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది నానా తంటాలు పడాల్సి వస్తోంది. జిల్లా కేంద్రం మంచిర్యాలతోపాటు మిగతా పట్టణాల్లోనూ చాలా భవనాలకు అగ్ని ప్రమాదాలు నిలువరించే కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో నష్టం విలువ పెరుగుతోంది. రూ.కోట్ల వ్యాపారాలు చేస్తున్న చోట కూడా నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో అనుకోని ప్రమాదాల్లో తీవ్రత పెరుగుతోంది. బహుళ అంతస్తులు నిర్మిస్తున్నప్పుడే భద్రత ప్రమాణాలు పాటించాల్సి ఉన్నా.. అవేవీ అమలు కావడం లేదు. జిల్లా కేంద్రంలో అనేక బహుళ అంతస్తులు, వ్యాపార సంబంధ భవనాలకు విపత్తుల ముప్పు ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

వీడని నిర్లక్ష్యం

జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, జన్నారంలో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. లక్సెట్టిపేటలోనూ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నా అమలుకు నోచుకోవడం లేదు. జిల్లాలో ప్రతీ ఏడాది అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. గతేడాది 80వరకు అగ్నిప్రమాదాలు జరిగాయి. గత డిసెంబర్‌లోనే 12ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. సాధారణంగా చలికాలంలో ప్రమాదాలు తక్కువగా జరుగుతాయి. ఎక్కువగా ఏప్రిల్, మేలో ఉంటాయి. కానీ గత ఏడాది ఆఫ్ సీజన్‌లోనూ జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, ఆసుపత్రులు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, నివాస సముదాయాల్లో ప్రమాదాలు నమోదవుతున్నాయి. ఎక్కువగా షార్ట్ సర్క్యూట్, రిఫ్రిజిరేటర్లలో అధిక వేడి, ఎల్పీజీ సిలిండర్ల కారణంగా సంభవిస్తున్నాయి. రోజుకు రూ.లక్షల్లో వ్యాపార లావాదేవీలు చేసే సంస్థలు సైతం కనీస జాగ్రత్తలపై నిర్లక్ష్యం వహిస్తున్నాయి. అగ్నిమాపక సిబ్బంది సూచనల మేరకు తగినట్లు నిర్మాణాలు, పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నా చాలామంది పెడచెవిన పెడుతున్నారు. అటు అధికారుల ఉదాసీనతతోనూ నష్టం తప్పడం లేదు.

నోటీసులతో మారని తీరు

భవన నిర్మాణాల ఎత్తు 15మీటర్లలోపు ఉంటే మున్సిపాలిటీలు, 15మీటర్లపై ఉన్న భవనాలకు స్థానిక అగ్నిమాపక అధికారుల నుంచి ఫైర్‌సేఫ్టీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఫైరింజిన్ భవనం చుట్టూ వెళ్లేలా ఉండడం, ఫైర్‌లైన్స్, పరికరాలు ఉన్నప్పుడే ఫైర్ అధికారులు ధ్రువీకరణ పత్రాలు ఇస్తారు. చాలామంది ఎంత పెద్ద భవనాలైనా 15మీటర్లలోపు నిర్మాణాలుగానే చెబుతూ తప్పించుకుంటున్నారు. ఇక మార్కెట్‌లో అంగుళం జాగా కూడా ఖరీదు కావడంతో ఎక్కడా ఒక్క అడుగు విడిచిపెట్టకుండా నిర్మాణాలు చేపడుతూ నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. దీంతో ఎన్‌వోసీ లేకున్నా కార్యకలాపాలు నడుస్తున్నాయి. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులకు ఇప్పటికీ ప్రమాదాల నివారణ రక్షణ లేకుండానే కొనసాగిస్తున్నాయి. దాదాపు 20భవనాల వరకు నోటీసులు ఇచ్చినా వారి నుంచి స్పందన లేదు. మున్సిపాలిటీ నుంచి అనుమతులు పొందుతూ వ్యాపారాలు సాగిస్తున్నారు.

101పై అవగాహన తక్కువే..

అగ్ని ప్రమాదాల జరిగితే స్పందించడంపై అనేక మందికి అవగాహన రావడం లేదు. ఫైర్‌స్టేషన్ ఫోన్ నంబర్లు కూడా తెలియడం లేదు. పోలీసు శాఖ 100నుంచి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం వస్తోంది. గత నెల 16న మందమర్రి మండలం వెంకటాపూర్ పరిధి గుడిపల్లి ఆరుగురు సజీవ దహనం ఘటనలోనూ మొదట పోలీసుస్టేషన్‌కు సమాచారం వచ్చాకే ఫైర్‌స్టేషన్‌కు వెళ్లింది. దీంతో ఆలస్యం జరిగి ప్రమాద తీవ్రత పెరుగుతోంది. ఫైర్ అత్యవసర నంబరు 101చాలా మందికి తెలియకపోవడం పెద్ద సమస్యగా మారింది. గ్రామీణ ప్రాంతాలు, ఫైర్‌స్టేషన్‌కు దూరంగా ఉన్న చోట్ల జరిగితే సమాచార ఆలస్యంతోనూ ఆస్తి నష్టం జరుగుతోంది. ప్రమాదం ఎప్పుడు, ఎలా జరిగిందో గుర్తింపులోనూ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఒకవేళ రాత్రి జరిగితే తీవ్రత ఎక్కువవుతోంది.

ఎన్‌వోసీ నిరాకరిస్తున్నాం



భవనాలకు ఫైర్‌సేఫ్టీ లేకుంటే ఎన్‌వోసీ ఇవ్వడం లేదు. రక్షణ జాగ్రత్తలు లేని చోట నోటీసులు ఇస్తున్నాం. ప్రజలకు అగ్ని ప్రమాదాల అప్రమత్తతపై అవగాహన, మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తున్నాం. ఈ చలికాలంలోనూ ప్రమాదాలు ఎక్కువగా జరిగాయి. వీలైనంత వరకు ప్రమాద నష్టం తక్కువగా ఉండేలా చూస్తున్నాం.

– బి.అజయ్‌కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి

ప్రజావాణిపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ భారతిహోళ్లికేరి
- సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ



కోటపల్లిలో ప్రజావాణిలో పాల్గొన్న కలెక్టర్

కోటపల్లి: మండల స్థాయిలో జరిగే ప్రజావాణిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ భారతిహోళ్లికేరి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉపాధి హామీ పథకం డబ్బులు రావడం లేదని ఏసన్‌వాయి గ్రామానికి చెందిన ముల్కల్ల సమ్మయ్య ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా కలెక్టర్ భారతిహోళ్లికేరి మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలోనే ఫిర్యాదులను పరిష్కరించాలని, చిన్న చిన్న వాటికి జిల్లా కేంద్రాలకు ఫిర్యాదులు అందుతున్నాయని, దీనిపై గ్రామ, మండల స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని చెప్పారు. మండలంలో అధిక శాతం భూ సమస్యల ఫిర్యాదులు వస్తున్నాయని, రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని రెవెన్యూ, భూ సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని ఆదేశించారు. అనంతరం మల్లంపేట పల్లెప్రకృతివనం, డంపింగ్‌యార్డు, నర్సరీలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కోటపల్లి బృహత్ పల్లె ప్రకృతి వనం నిర్వహణ సక్రమంగా లేదని కార్యదర్శిపై అసహనం వ్యక్తం చేశారు. మొక్కల పెంపకం, తీసుకుంటున్న జాగ్రత్తలపై ఎంపీడీఓ భాస్కర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ట్రెయినీ కలెక్టర్ గౌతమి, సర్పంచ్ అక్కల మధుకర్, మండల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

పాతమంచిర్యాల: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమం చేపట్టిందని, ప్రజల నుంచి అందిన అర్జీలు పరిశీలించి సంబంధిత అధికారుల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ భారతిహోళ్లికేరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ట్రెయినీ కలెక్టర్ గౌతమితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జీవనోపాధి, అక్రమ నిర్మాణాలు, పట్టాపాస్‌పుస్తకాలపై అర్జీలు సమర్పించారు.

సామాన్యులకు ఉచిత న్యాయసేవలు

- జిల్లా న్యాయమూర్తి జీ.సత్తయ్య



ప్రారంభిస్తున్న జిల్లా న్యాయమూర్తి సత్తయ్య

మంచిర్యాలక్రైం: జిల్లాలోని సామాన్య ప్రజలకు ఉచిత న్యాయసేవలు అందించేందుకు హైకోర్టు రాష్ట్ర వ్యాప్తంగా 23జిల్లాల్లో న్యాయసేవాధికార సంస్థలను ప్రారంభించిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి బీ.సత్తయ్య, జిల్లా కలెక్టర్ భారతిహోళ్లికేరి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థలను రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.నవీన్‌రావు, హైకోర్టు న్యాయమూర్తి, మంచిర్యాల జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ ఏ.వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ వర్చువల్ విధానంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సత్తయ్య మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం న్యాయసేవలు పొందడం ప్రతీ ఒక్కరి హక్కు అని, అందరికీ సమాన న్యాయం అందే విధంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థలు ఉచిత సేవలు అందిస్తాయని తెలిపారు. పేదలు, ఒంటరి మహిళలు, నిరక్షరాస్యులు, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచిత న్యాయ సలహాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 2022లో న్యాయసేవాధికార సంస్థల ద్వారా 10,640మందికి సహాయం అందించామని, సుమారు 3వేల అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీ.రాహుల్, ట్రెయినీ కలెక్టర్ గౌతమి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవీందర్‌రావ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

భూమి పట్టాలు ఇవ్వాలని ధర్నా



ఆందోళన చేస్తున్న రైతులు, బీజేపీ నాయకులు

పాతమంచిర్యాల: జిల్లాలోని నెన్నెల శివారులో సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు, బీజేపీ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ భారతిహోళ్లికేరికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ మాట్లాడుతూ నెన్నెల శివారులోని 672 సర్వేనంబరులోని భూమిలో రైతులు 50ఏళ్లుగా సాగులో ఉన్నారని, గత ప్రభుత్వం పట్టాపాస్‌బుక్‌లు మంజూరు చేసిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వారికి పట్టాపాస్‌బుక్‌లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని, సంక్షేమ పథకాలు అందడం లేదని తెలిపారు. కలెక్టర్ విచారణ జరిపించి కొత్తపాస్‌బుక్‌లు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నెన్నెల మండల బీజేపీ అధ్యక్షుడు శైలేంద్ర సింగ్, భీమిని మండల బీజేపీ అధ్యక్షుడు భీమయ్య, గజేందర్‌సింగ్, ఇందూరి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

6న స్కీం వర్కర్ల సమస్యలపై నిరసన



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు దుంపల రంజిత్‌కుమార్

పాతమంచిర్యాల: స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6న నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలులో స్కీం వర్కర్లు ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన ఏజెన్సీల కార్మికులు, ఉపాధి హామీ, ఐకేపీ వీవోఏ, సర్వశిక్ష అభియాన్ ప్రధాన పోషిస్తున్నారని తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని తీర్మానం చేసి ఎనిమిదేళ్లు గడిచినా అమలు కాలేదని తెలిపారు. నిరసన కార్యక్రమాల్లో స్కీం వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు ప్రకాష్, భానుమతి, సమ్మక్క శ్రీనివాస్, రాజేశ్వరీ, భాగ్యరాజ్, శోభ, రవి, శంకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పాత మంచిర్యాల: జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపనీ లిమిటెడ్ ద్వారా స్పెసిఫైడ్ స్కిల్డ్‌వర్కర్లు జపాన్‌లో పనిచేయడానికి అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. బీఏ స్సీ నర్సింగ్ గ్రాడ్యుయేట్లు, జీఎన్ఎం డిప్లొ మా హోల్డర్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల వయస్సు 22 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 4న వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలలో నిర్వహించనున్న స్క్రీనింగ్ పరీక్షకు హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జపనీస్ భాషపై వృత్తిపరమైన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు టాంకాం హెచ్ఆర్ మేనేజర్‌ను 9100798204, 9908830438 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

కూచిపూడి నృత్యంలో విద్యార్థిని ప్రతిభ


బహుమతి సాధించిన లక్ష్మీప్రణీత

రామకృష్ణాపూర్ (చెన్నూర్): కూచిపూడి నృత్యంలో గద్దెరాగడిలోని గ్రీన్‌వుడ్ పాఠశాలకు చెందిన విద్యార్థిని సాన లక్ష్మీప్రణీత ప్రతిభ కనబరిచింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుజన కళామహోత్సవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కూచిపూడి విభాగంలో ఆరో తరగతి విద్యార్థిని లక్ష్మీప్రణీత విన్నర్‌గా నిలిచింది. సోమవారం సదరు విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్, అయూబ్, తదితరులు అభినందించారు.

సంజీవరెడ్డిని కలిసిన ఐఎన్టీయూసీ నేతలు


పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు జీ.సంజీవరెడ్డిని విద్యుత్ ఉద్యోగుల సంఘం (327) జిల్లా నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. యూనియన్ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ శ్రీధర్, మంచిర్యాల జిల్లా రీజియన్ సెక్రెటరీ పర్రె రమేశ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలు, యూనియన్ బలోపేతం, నిర్మాణ అంశాలపై చర్చించినట్లు వారు పేర్కొన్నారు.

కలప తరలిస్తున్న నలుగురి అరెస్టు

జన్నారం(ఖానాపూర్): అక్రమంగా కలప తరలిస్తూ పట్టుబడ్డ నలుగురు వ్యక్తులను సోమవారం అరెస్టుచేసి కోర్టులో హాజరు పర్చినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి రత్నాకర్‌రావు తెలిపారు. గతనెల 28 న 8 కలప దుంగలను రోటిగూడ గోదావరి నుంచి జగిత్యాల జిల్లాకు తరలిస్తున్న చిలువేరు సత్తయ్య, కుంట రమేశ్, బోదాసు మల్లేశ్, రమేశ్‌లను అరెస్ట్ చేసి లక్సెట్టిపేట కోర్టులో హాజరు పర్చినట్లు ఆయన పేర్కొన్నారు. నిందితులకు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.


ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికులు (ఫైల్)

ఆదాయంపై ఆర్టీసీ నజర్

- సంక్రాంతికి ప్రత్యేక బస్సులు
- ఈ నెల 7 నుంచి 13 వరకు సౌకర్యం
- ఐదు డిపోల పరిధిలో 236 స్పెషల్ బస్సులు

మంచిర్యాలఅర్బన్: నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాటలోకి తెచ్చేందుకు సంస్థ యాజమాన్యం అందివచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటోంది. టికెటేతర ఆదాయానికి కార్గో సర్వీసులు, అయ్యప్పస్వాములకు ప్రత్యేక బస్సులు, సింగరేణి దర్శన్, విహారయాత్రలకు స్పెషల్ బస్సులు నడిపిన ఆర్టీసీ సంక్రాంతికి ప్రత్యేక బస్సులు నడిపేందుకు సమాయత్తమవుతోంది. పండుగ నేపథ్యంలో విద్యార్థులకు సెలవులు వస్తున్నాయి. దైవదర్శనాలు, పండుగ సందళ్లు షురూ కానున్నాయి. ఈనేపథ్యంలో రాకపోకలు పెరుగనున్నాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా, ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లా నుంచి ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు వెళ్లినవారు.. చదువుల నిమిత్తం అక్కడ ఉన్న విద్యార్థులంతా సంక్రాంతికి స్వగ్రామాలకు వస్తుంటారు. ఈనేపథ్యంలోనే ఆదిలాబాద్ రీజియన్ నుంచి ఆర్టీసీ 236 ప్రత్యేక (స్పెషల్) బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టింది.

ఈ నెల 7 నుంచి 13 వరకు..

ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, భైంసా, ఆసిఫాబాద్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. గతంలో ప్రత్యేక బస్సులు నడిపించినా ఆశించిన మేర ఆదాయం రాకపోవడమో లేక మరేదైనా కారణమో కానీ ఈసారి ఉట్నూర్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయలేదు. మిగిలిన ఐదు డిపోల నుంచి ఈ నెల 7వ తేదీ నుంచి 13 వరకు జేబీఎస్ వరకు బస్సులు నడుపనున్నారు. ఆదిలాబాద్ డిపో నుంచి 70, భైంసా డిపో నుంచి 22 నిర్మల్ డిపో నుంచి 48, ఆసిఫాబాద్ డిపో నుంచి 30, మంచిర్యాల డిపో నుంచి 66 బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు ఎప్పటికప్పుడు బస్సుల సమాచారం అందించేందుకు గానూ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు. ఆదిలాబాద్ రీజియన్ నుంచి ఈ నెల 7న 43, 8న 29, 9న 37, 10న 31, 11న 25, 12న 38, 13న 33 బస్సులు నడుపనున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక బస్సుల వివరాలు

డిపో	బస్సులు
ఆదిలాబాద్	70
భైంసా	22
నిర్మల్	48
ఆసిఫాబాద్	30
మంచిర్యాల	66
ఉట్నూర్	0
మొత్తం	236

హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ రీజియన్‌కు ప్రత్యేక బస్సుల వివరాలు(డిపోల వారీగా)

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఆసిఫాబాద్	మంచిర్యాల
07	11	04	11	05	12
08	13	02	03	04	07
09	09	05	11	05	12
10	08	04	06	05	08
11	08	04	10	05	07
12	11	02	09	05	11
13	10	02	03	04	14

మరిన్ని బస్సులు నడిపే అవకాశం



సంక్రాంతికి ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటే మరిన్ని స్పెషల్ బస్సులు నడిపే అవకాశం ఉంది. ప్రత్యేక బస్సులకు సాధారణ చార్జీలే ఉంటాయి. స్పెషల్ బస్సుల్లో రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉంటుంది. సురక్షిత ప్రయాణానికి ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి.

– జానీరెడ్డి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, ఆదిలాబాద్

గిరిజనుల సమస్యలు పరిష్కరించండి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి


గిరిజనుల అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి 86 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనులు సమస్యలను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈనెలలో జరిగే నాగోబా జాతర దృష్ట్యా హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు వేగవంతం చేయాలన్నారు. డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్, ఏపీవో పీటీజీ భాస్కర్, ఏపీవో జనరల్ భీంరావ్, ఏడీఎమ్‌హెచ్‌వో మనోహర్, ఏవో రాంబాబు, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

- అర్హులందరికీ 'గిరి వికాసం' పథకం మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం చిన్నగంగాపూర్ గిరిజనులు వేడుకున్నారు.
- రైతుబంధు సాయం అందించాలని గాదిగూడ మండలం కొటాలకు చెందిన కుడ్మెత జంగుబాయి అర్జీ పెట్టుకుంది.
- ఉట్నూర్ మండలం కల్లూర్‌లో అంగన్‌వాడీ, కమ్యూనిటీలకు భవనాలు మంజూరు చేయాలని గ్రామ గిరిజనులు కోరారు.
- కుటుంబ పోషణ కోసం మేకల కొనుగోలుకు రుణం అందించాలని ఉట్నూర్ మండలం హస్నాపూర్‌కు చెందిన భుజంగ్‌రావ్ విన్నవించాడు.
- ఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూములకు అటవీ హక్కు పత్రం అందించాలని నార్నూర్ మండలం మహాగాంకు చెందిన జాదవ్ జాలమ్ వేడుకున్నాడు.
- డిగ్రీ, బీఎడ్ పూర్తి చేశానని టెట్ ఉత్తీర్ణత సాధించానని తనకు ఏదైన ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీగా అవకాశం కల్పించాలని ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన అత్రం మౌనిక అర్జీ పెట్టుకుంది.

కలప తరలింపుపై అధికారుల సమావేశం


సమావేశంలో పాల్గొన్న వీఎస్ఎస్ సభ్యులు

భీమారం(చెన్నూర్): మంచిర్యాల అటవీ డివిజన్ పరిధిలోని భీమారం నీలగిరి ప్లాంటేషన్‌లో కలప తరలింపుపై సోమవారం అటవీశాఖ అధికారులు వన సంరక్షణ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. 1997లో వీఎస్ఎస్ సభ్యుల భాగస్వామ్యంతో అటవీశాఖ భీమారం రిజర్వుఫారెస్టులో దాదాపు 300 హెక్టార్ల నీలగిరి ప్లాంటేషన్ చేపట్టారు. అయితే మొక్కలు ఎదగడంతో అటవీశాఖ డిసెంబర్ 31న వాటిని యంత్రాల ద్వారా కట్ చేసి పేపర్ మిల్లుకు తరలించేందుకు యత్నిస్తుండగా వీఎస్ఎస్ సభ్యులు అడ్డుకున్నారు. వచ్చే ఆదాయంలో సగం వాటా ఇవ్వకుండా అటవీశాఖ పనులు చేపట్టిందని, అందుకే అడ్డుకున్నామని సభ్యులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మంచిర్యాల అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ రమేశ్, సెక్షన్ ఆఫీసర్ రామకృష్ణ వీఎస్ఎస్ సభ్యులను పిలిపించి మాట్లాడారు. గతంలో ఉన్న ఒప్పందం ప్రకారమే తాము కలపని అమ్ముతున్నామని, వచ్చే డబ్బుల్లో సగం కమిటీ బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని, సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇందుకు సభ్యులు అంగీకరించడంతో కలప తరలింపు ప్రారంభించారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం


రెండు కాళ్లు కోల్పోయిన క్రాంతికుమార్

బెల్లంపల్లి: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్యకు యత్నించి రెండుకాళ్లు కోల్పోయిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. బెల్లంపల్లి రైల్వే ఔట్ పోస్టు హెడ్ కానిస్టేబుల్ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి మండలం మాల గురిజాల గ్రామానికి చెందిన గోమాస క్రాంతికుమార్ సోమవారం ఉదయం కాల్‌టెక్స్ వద్ద ఉన్న రైలు పట్టాలపై కూర్చున్నాడు. అదే సమయంలో తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ఆమార్గంలో వెళ్తుండగా లోకో పైలెట్ హారన్ కొట్టినా కదలకుండా పట్టాలపైనే కూర్చున్నాడు. రైలు దగ్గరికి రాగానే వెనక్కి జరగడంతో రెండుకాళ్లు పట్టాలపైనే ఉండిపోయాయి. దీంతో రైలు రెండు కాళ్లపై నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జు అయ్యాయి. ముందుగా స్థానిక ఆస్పత్రికి, అనంతరం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా గ్రామంలో మినీ ఏటీఎం నిర్వహిస్తున్న క్రాంతికుమార్ వినికిడి సమస్యతో బాధపడుతున్నాడని, బ్యాంకునుంచి డబ్బులు డ్రా చేసుకోవడానికి తరచూ ఎస్‌బీహెచ్ బ్యాంకుకు వెళ్తాడని, పట్టాలు దాటుతుండగా ఘటన చోటు చేసుకుందని, ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం లేదని కుటుంబసభ్యులు స్పష్టం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఎస్టీపీపీలో డీజిల్ దొంగలు..!

జైపూర్(చెన్నూర్): మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో డీజిల్ చోరీకి గురవుతున్నట్లు తెలుస్తోంది. ఎస్టీపీపీ విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న పవర్‌మేక్ కంపెనీలోని వాహనాల్లో నింపే డీజిల్ పక్కదారి పడుతోంది. గత నెల 31న 100 లీటర్లకుపైగా డీజిల్ చోరీచేసి తరలిస్తున్న క్రమంలో ఎస్టీపీపీ ప్రధాన గేటు వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తాజాగా మళ్లీ మరో 30లీటర్ల డీజిల్ తరలిస్తుండగా పట్టుబడ్డట్లు తెలిసింది. ఎస్టీపీపీకి సీఐఎస్ఎఫ్ పటిష్ట భద్రత కల్పిస్తున్నప్పటికీ ఇటీవల తరుచూ దొంగతనాలు చోటు చేసుకోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

బైక్ ఢీకొని ఒకరు మృతి


బొజ్జిరావు మృతదేహం

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని చొపన్‌గూడ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. పెద్దసాకడ గ్రామానికి చెందిన అడ బొజ్జిరావు(36) కొఠారి గ్రామంలో ఉన్న తన భార్యను తీసుకువచ్చేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. చొపన్‌గూడ సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా బైక్‌పై వస్తున్న జైనూర్‌కు చెందిన సిడాం మోతిరాం ఢీకొట్టాడు. ఘటనలో బొజ్జిరావు తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. సోమవారం మృతుని భార్య ఇందిరాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్‌డీఎల్ యంత్రాలకోసం
ఎదురుచూపు

- బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం
- నిరాశలో అధికారులు, కార్మికులు


శాంతిఖని షాఫ్టు మైన్

బెల్లంపల్లి: బెల్లంపల్లి శాంతిఖని భూగర్భగనికి కొత్తగా వచ్చే ఎస్‌డీఎల్ యంత్రాల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం గనిలో బోల్టర్ మైనర్ (బీఎం) యంత్రం ద్వారా అంతంతమాత్రంగా బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. ప్రైవేట్ భాగస్వామ్యంతో ఎస్‌డీఎల్ యంత్రాలు తెప్పించి అధిక ఉత్పత్తి చేయాలని ఆశిస్తున్న గని అధికారులకు నిరాశ మిగులుతోంది. వాస్తవానికి ఏడాదిపైబడి ఎస్‌డీఎల్ యంత్రాలకోసం ప్రతిపాదనలు చేస్తున్నా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో ఆ ప్రభావం బొగ్గు ఉత్పత్తిపై పడుతోంది. నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనలో గని వెనుకబడిపోతుందని అధికార, కార్మికవర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గని వార్షిక ఉత్పత్తి లక్ష్యం 2.4 లక్షల టన్నులుకాగా లక్ష్యాన్ని చేరుకోవడంలో గని కొంతకాలంగా వెనుకబాటుకు గురవుతున్నట్లు తెలుస్తోంది.

నీరుగార్చిన కంటిన్యూయస్ మైనర్ యంత్రం

శాంతిఖని గని ప్రయోగాలకు ప్రసిద్ధి గాంచింది. బెల్లంపల్లి రీజియన్ పరిధిలో శాంతిఖని గనిని మెగా లాంగ్‌వాల్ ప్రాజెక్టుగా తీర్చిదిద్దుతామని కొన్నాళ్ల క్రితం సింగరేణి యాజమాన్యం ప్రకటించింది. దీంతో గనికి, బెల్లంపల్లికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆశించారు. ఆక్రమంలోనే బొగ్గు అధికోత్పత్తి చేయాలనే ఉద్దేశంతో రూ.90 కోట్లు వెచ్చించి కంటిన్యూయస్ మైనర్ (సీఎం) యంత్రాన్ని కొనుగోలు చేసి గనిలో దింపారు. కానీ భూగర్భ భౌగోళిక స్థితిగతులు సరిగా లేక యంత్రం ద్వారా బొగ్గు ఉత్పత్తి చేయడానికి అనువైన పరిస్థితులు లేకుండా పోయాయి. అనివార్యంగా ఏడాదిక్రితం ఆర్జీ-1 ఏరియాలోని 7ఎల్ఈపీ గనికి సీఎం యంత్రాన్ని తరలించారు. తరలింపుకు ముందస్తుగా బోల్టర్ మైనర్ (బీఎం)యంత్రాన్ని తెచ్చి గనిలో ప్రవేశ పెట్టారు. ప్రస్తుతం ఆయంత్రం ద్వారా గనిలో కాస్తో కూస్తో బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. సీఎం యంత్రం లేని లోటును పూడ్చడానికి మరో మూడు ఎస్‌డీఎల్ యంత్రాలను రప్పించడానికి చేస్తున్న యత్నాలన్నీ నత్తనడకన సాగుతున్నాయి.

ప్రైవేట్ భాగస్వామ్యంలో ఎస్‌డీఎల్ యంత్రాలు

శాంతిఖనిలో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను ఓ విదేశీ కంపెనీకి అప్పగించేందుకు సిద్ధమయ్యారు. ఈపాటికే సదరు కంపెనీతో ఒప్పందం చేసుకుని బొగ్గు వెలికితీత పనులు చేపడుతున్నారు. ఎస్‌డీఎల్ యంత్రాలు సైతం సదరు విదేశీ సంస్థ ద్వారానే రప్పించే యత్నాలు జరుగుతున్నట్లుగా ప్రచారం సాగుతోంది. గని నుండి బొగ్గు వెలికి తీసి ఇచ్చినందుకు విదేశీ కంపెనీకి టన్ను చొప్పున లెక్క కట్టి సింగరేణి డబ్బులు చెల్లించనుంది. నాలుగు నెలల క్రితం విదేశీ సంస్థతో సింగరేణి ఒప్పందం చేసుకోగా ఎస్‌డీఎల్ యంత్రాల రాకకు మరో మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా 'సాక్షి'కి తెలిపారు.

ఉత్పత్తి లక్ష్యసాధనకు ప్రత్యేక ప్రణాళిక


మాట్లాడుతున్న ఏరియా జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఏరియాకు నిర్దేశించిన వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ అన్నారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతనెలలో ఏరియాకు 3.5లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 81శాతంతో 2.83 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించిందన్నారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వార్షిక లక్ష్యసాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామన్నారు. గోలేటి ఓసీపీ ప్రారంభానికి అన్ని చర్యలు చేపడుతున్నామని, మే లేదా జూన్ మాసంలో బొగ్గు ఉత్పత్తిని చేపట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎంవీకే ఓసీపీ పనులు సైతం చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ రెండు ఓసీపీలతో ఏరియాకు పూర్వ వైభవం సంతరించుకుంటుందన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం గుప్తా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీవైజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బేహారా, డీవైపీఎం తిరుపతి పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో కాంట్రాక్ట్ కార్మికుల నిరసన


శ్రీరాంపూర్‌లో నిరసన తెలుపుతున్న కార్మికులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): బొగ్గు గని కార్మికులకు సంబంధించి మంగళవారం కోల్‌కత్తాలో జరుగనున్న 11వ వేజ్‌బోర్డు సమావేశంలో కాంట్రాక్ట్ కార్మికులకు ఫస్ట్ కేటగిరి వేతనం కల్పించేలా ఒప్పందం చేసుకురావాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీ.బ్రహ్మానందం మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధ హక్కులు కల్పించాలని, ఇందుకు వేజ్‌బోర్డులోని జాతీయ సంఘాల సభ్యులు కోలిండియా యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని కోరారు. నాయకులు యాదగిరి, అప్పారావు, శంకర్, రాజయ్య, బాపు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటిలోని సివిల్ డిపార్టుమెంట్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏరియా కార్యదర్శి శ్రీనివాస్, అధ్యక్షుడు పోషం మాట్లాడుతూ కోల్ ఇండియాలో అమలు అవుతున్న హైపవర్ కమిటీ వేతనాలు సింగరేణిలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు గోపాల్, పోసుబాయి, స్వామి, సావిత్రి, లక్ష్మి, రాణి, సికిందర్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు పారదర్శకంగా ప్రమోషన్లు


శ్రీరాంపూర్: ప్రమోషన్ పత్రాలు అందిస్తున్న జీఎం


పత్రాలు అందజేస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఉద్యోగులందరికీ పారదర్శకంగా ప్రమోషన్లు అందిస్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే 5, ఎస్సార్పీ 3 గనుల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సోమవారం సర్వీస్ లింక్డ్ ప్రమోషన్ పత్రాలు అందించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ ఇటీవల యాక్టింగ్ చేసిన కార్మికులకు వారి డిజిగ్నేషన్ల ఆధారంగా ప్రమోషన్ కల్పిస్తున్నామన్నారు. అనంతరం ఎస్సార్పీ 3 గనిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ప్రారంభించారు. ఈ రెండు గనులతో పాటు ఆయన ఎస్సార్పీ 1, ఆర్కే 5 గనులపై నిర్వహించి న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలు సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏరియా ఎస్‌ఓటూ జీఎం త్యాగరాజు, ఏరియా ఇంజినీర్ రమేశ్‌బాబు, ఏజెంట్ గోపాల్ సింగ్, ఏవీ రెడ్డి, మేనేజర్లు సంతోశ్‌కుమార్, అబ్దుల్‌ఖాధీర్, టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ సత్యనారాయణ, గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పత్రాలు అందజేత

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియా కాసిపేట గనిపై సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం చింతల శ్రీనివాస్ కార్మికులకు ప్రమోషన్ పత్రాలు అందజేశారు. ఏజెంట్ రాజేందర్, ఏఎస్‌ఓ ఓదెలు, మేనేజర్ అల్లాఉద్దీన్, కార్మిక సంఘాల నాయకులు దాగం మల్లేశ్, బి యాల వెంకటస్వామి, మినుగు లక్ష్మీనారాయణ, మేడ సమ్మయ్య, భైరి శంకర్, రక్షణాధికారి సునీల్‌కుమార్, సంక్షేమాధికారి జీషాన్, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఎస్ఎల్పీ, ఎస్ఎల్ఐ పత్రాలు అందజేత

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని అర్హులైన ఉద్యోగులకు జీఎం చింతల శ్రీనివాస్ చేతుల మీదుగా ఎస్ఎల్పీ, ఎస్ఎల్ఐ పత్రాలు అందజేశారు. ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో ఆఫీస్ హెచ్‌వోడీ శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, సీనియర్ పీవో మైత్రేయబంధు, ఆఫీస్ సూపరింటెండెంట్ రాయలింగు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న గంగాధర్

ఉట్నూర్‌రూరల్: కళాశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఉమ్మడి జిల్లా గిరిజన గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో గల గిరిజన గురుకుల బాలికల డిగ్రీ కళాశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. తరగతి గదులు పరిశీలించారు. నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తి చేయాలని అధ్యాపకులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ హరిత, సీనియర్ అసిస్టెంట్ బాబులాల్, అధ్యాపకులు ప్రతీమ్, శ్రీవాణి, మానస, సుధరాణి, ఎల్లవ్వ, నాగశ్రావణి తదితరులు ఉన్నారు.